క్లుప్తంగా

నేడు వైద్య శిబిరం

కర్నూలు (న్యూటౌన్): పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి జన్మదినం సందర్భంగా నంద్యాల శాంతిరాం జనరల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో బుధవార మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే కార్యాలయం మంగళవారం ఒక ప్రకటన విడుదల అయ్యింది. డాక్టర్లు గుండె, కంటి పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మెగా వైద్య శిబిరం ఉంటుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఘనంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవం



నినాదాలు చేస్తున్న సీపీఐ కార్యకర్తలు

గూడూరు: సీపీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ కార్యకర్తలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. సీపీఐ మండల కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.కృష్ణ స్థానిక పాత బస్టాండ్ సెంటర్ వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. ప్రజల పక్షాన నిలబడి, వారి సమస్యల పరిష్కారానికి పోరాడే పార్టీ సీపీఐ అన్నారు. నాయకులు లక్ష్మన్న, దాసు, మల్లిఖార్జున, మురళి, మహేష్ పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన అవసరం



రాజకీయ పార్టీల నాయకులతో ఆర్డీఓ

కోడుమూరు రూరల్: ఓటు హక్కు ఎంతో విలువైందని.. ఓటర్లలో రాజకీయ పార్టీల నాయకులు అవగాహన కల్పించాలని కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్ సూచించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితా రూపకల్పనపై ఆర్డీఓ హరిప్రసాద్ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ.. బీఎల్వోలు గ్రామాల్లో ఇంటింటికి తిరగడంతో పాటు ప్రత్యేక ఓటరు నమోదు క్యాంపులను ఏర్పాటు చేసి ఓటరు జాబితాలో ఉన్న డబుల్ ఓట్లను, చనిపోయిన వారి ఓట్లను తొలగించి తప్పులు తడకలు లేకుండా ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందిస్తున్నారన్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఓట్లను ఒకే బూత్‌లో ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే జనవరి నాటికి 18 ఏళ్లు నిండిన యువతీయువకులంతా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేలా బీఎల్వోలు చర్యలు తీసుకున్నారన్నారు. ఓటరు జాబితాపై ఏవైనా అభ్యంతరాలుంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని తెలిపారు. తహసీల్దార్ జయన్న, ఎన్నికల డీటీ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రణాళికతోనే పదిలో ఉత్తమ ఫలితాలు



విద్యార్థినులకు సూచనలు చేస్తున్న ఎంఈఓ

సి.బెళగల్: ప్రణాళిక, క్రమశిక్షణతోనే పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించగలరని ఎంఈఓ జ్యోతి అన్నారు. మంగళవారం స్థానిక కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థినులతో ప్రత్యేకంగా సమావేశమై పాఠ్యాంశాలపై చర్చించారు. సిలబస్, గతంలో నిర్వహించిన పరీక్షల ఫలితాలపై ఆరా తీశారు. మంచి మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

తుంగభద్ర నదిలోకి చేప పిల్లలు



చేపపిల్లలను తుంగభద్ర నదిలో వదులుతున్న ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు సిటీ: కర్నూలు రూరల్ మండల పరిధిలోని గొందిపర్ల వద్ద తుంగభద్ర నదిలో కోడుమూరు ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్ మంగళవారం చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మత్స్యకారులు నదిలో చేపలు పెంచుకునేందుకు అనువుగా ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చిన సుమారు రూ.18 లక్షల విలువైన చేప పిల్లలను నదిలో వదిలామన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా చేయని విధంగా మత్స్యకారుల కోసం రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, వైస్ ఎంపీపీ నెహిమియా పాల్గొన్నారు.

క్రీడాకారులకు వరం ఆడుదాం..ఆంధ్రా

- అట్టహాసంగా ప్రారంభమైన క్రీడా పోటీలు
- ప్రారంభించిన ఎమ్మెల్యే సుధాకర్



కోడుమూరులో బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

కోడుమూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు గ్రామీణ క్రీడాకారులకు వరంలాంటిదని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని ప్యాలకుర్తి, పులకుర్తి, కోడుమూరులోని బాలుర హైస్కూల్లో పోటీలకు ఆయన ప్రారంభించారు. గ్రామీణ క్రీడాకారుల్లో దాగివున్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పోటీలను నిర్వహిస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో ఉండే క్రీడాకారులు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. క్రీడలతో చక్కటి ఆరోగ్యంతో పాటు మానసికోల్లాసం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ హరిప్రసాద్, మండల స్పెషలాఫీసర్ రంగా లక్ష్మిదేవి, తహసీల్దార్ జయన్న, ఎంపీడీఓ చంద్రశేఖర్, హెచ్ఓ మదన్‌మోహన్, ఈఓ అజయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. లద్దగిరి గ్రామంలో ఎంపీపీ రూతమ్మ పోటీలను ప్రారంభించారు.

గూడూరు రూరల్: పెంచికలపాడు హైస్కూల్ మైదానంలో క్రీడా పోటీలను తహసీల్దార్ వెంకటరమణ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాముడు, సుంకులమ్మ గుడి చైర్మన్ ఉమామహేశ్వరి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

సి.బెళగల్/గూడూరు: మండల కేంద్రంలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఎమ్మెల్యే సుధాకర్ బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించారు. గ్రామీణ క్రీడాకారులు పోటీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల ప్రత్యేకాధికారిణి శ్యామల, ఎంపీపీ బొంతల మునెప్ప, జెడ్పీటీసీ సభ్యుడు గిరిజోను, తహసీల్దార్ శేషఫణి, ఎంఈఓ జ్యోతి పాల్గొన్నారు. అలాగే గూడూరులోని జెడ్పీ పాఠశాల మైదానంలో ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌లు అస్లామ్, బోయ లక్ష్మన్న, తహసీల్దార్ వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ పాల్గొన్నారు. ఇటు పోలకల్ జెడ్పీ హైస్కూల్లో ఎంపీపీ బొంతల మునెప్ప పోటీలను ప్రారంభించారు.

పాణ్యం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీలను ఎంపీపీ ఉసేన్‌బీ ప్రారంభించారు. మండలంలో మొత్తం 4268 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు.

కర్నూలు (న్యూటౌన్): ఆడుదాం ఆంధ్రా పోటీలను గ్రామీణ ప్రాంత క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బోయ శారద అన్నారు. కల్లూరు మండలం సల్కాపురంలో పోటీలను ప్రారంభించారు.

కర్నూలు సిటీ: దేశంలోనే అతి పెద్ద టోర్నీగా ఆడుదాం ఆంధ్రా అవుతుందని ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్ అన్నారు. కర్నూలు రూరల్ మండల పరిధిలోని గొందిపర్ల గ్రామంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, వైస్ ఎంపీపీ నెహిమియాలు పాల్గొన్నారు.

క్రీడలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని కాల్వ, హుసేనాపురం గ్రామాలలో నిర్వహించిన షెటిల్, క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల యువతను క్రీడల్లో ప్రోత్సహించే దిశగా ఆడుదాం..ఆంధ్ర పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు బహుమతులు అందజేస్తున్నామన్నారు. అనంతరం హుసేనాపురం గ్రామంలో నిర్వహించిన క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే తిలకించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ మీదివేముల ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, సర్పంచ్ పెద్ద వెంకటేశ్వర్లు, చంద్ర గోవర్ధనమ్మ, సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు, చంద్రపెద్దస్వామి, జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్‌బాషా, కాల్వబుగ్గ ట్రస్టుబోర్డు చైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి, మాజీ చైర్మన్ గోపా రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



సంక్షేమ క్యాలెండర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు: మైనార్టీల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని కాల్వ గ్రామ-1 సచివాలయ పరిధిలో మంగళవారం ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ శివనాగప్రసాద్, తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడ్, సర్పంచ్ కె. పెద్ద వెంకటేశ్వర్లు, జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్‌బాషా తదితర నాయకులతో కలిసి ఎమ్మెల్యే కాటసాని ఆయా కాలనీల్లో విస్తృతంగా పర్యటించారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాలు బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధి ఇంతవరకు ఎప్పుడూ జరగలేదన్నారు. ప్రజలకు మేలు చేసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తెచ్చుకోవడం మనందరం బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. మాటలు చెప్పి, మోసం చేసే పార్టీలకు రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని సూచించారు. సంక్షేమ పథకాల ద్వారా అర్హతగల ప్రతి కుటుంబానికి ఏదో ఒక రూపంలో ప్రభుత్వ సాయం అందజేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు నాగిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు, కాల్వబుగ్గ ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ చంద్ర పెద్దస్వామి, వివిధ శాఖల అధికారులు, ఇంజనీర్లు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, వివిధ గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

రైతులు సాంకేతికత అందిపుచ్చుకోవాలి



డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సి.బెళగల్: వ్యవసాయ రంగం అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం కల్పిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని జిల్లా మత్స్యశాఖ డీడీ, మండల ప్రత్యేకాధికారిణి శ్యామల అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో వ్యవసాయంలో డ్రోన్ వినియోగం, ప్రభుత్వ రాయితీలపై మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్‌తో కలిసి రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బొంతల మునెప్ప అన్నారు.

పేదలందరికీ సంక్షేమ పథకాలు

సి.బెళగల్: అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చస్తున్నాయని ఎంపీపీ బొంతల మునెప్ప అన్నారు. మంగళవారం సి.బెళగల్ మండలం పోలకల్, బ్రాహ్మణదొడ్డి గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహిచారు. మండల అధికారులు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అర్హతలు, దరఖాస్తు విధాలను తెలియజేశారు. అనంతరం టీబీ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు.

డీఈఓపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

కర్నూలు(సెంట్రల్) : కర్నూలు డీఈఓ వి.రంగారెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. సెప్టెంబర్ 15వ తేదీ కలెక్టరేట్‌లో జరిగిన ఉద్యోగుల స్పందనలో డీఈఓ తనను అధికారుల ఎదుట తిట్టి అవమానించారని నంద్యాలకు చెందిన కె.సతీష్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ జరిపి మంగళవారం కేసు నమోదు చేసినట్లు వివరించారు. బనగానపల్లె మండలం రేవనూరు జెడ్పీ పాఠశాలలో సతీష్‌కుమార్ హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. అతను సమాచారం హక్కు చట్టం ద్వారా ఉన్నతాధికారులను పదే పదే ప్రశ్నలు అడిగేవారు. డీఈఓ రంగారెడ్డి అతన్ని వేధింపులకు గురిచేయడంతో పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపారు.

16న అవదూత రామిరెడ్డి తాత ఆరాధనోత్సవం



తాత ఆరాధనోత్సవాల క్యాలెండర్ల ఆవిష్కరణ

కర్నూలు (న్యూటౌన్): సాక్షాత్తు దత్తస్వరూపమైన విష్ణు, ఈశ్వర, బ్రహ్మ కలయిక అవతారమే అవధూత రామిరెడ్డి తాత అని తాత సంస్థాన్ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం కల్లూరులోని అవదూత రామిరెడ్డి తాత ఆశ్రమంలో 31వ ఆరాధన మహోత్సవాలు, నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 16న తాత ఆరాధనోన మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని, కుటుంబ సమేతంగా భక్తులు తరలివచ్చి రామిరెడ్డి తాతను దర్శించుకుని పునీతులవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైపీ క్రేన్స్ అధినేత రవికుమార్, లలితా పీఠం పీఠాధిపతి మేడ సుబ్రహ్మణ్యం, భీమేశ్వర స్వామి దేవాలయ ధర్మకర్త లక్ష్మీరెడ్డి, భజరంగ్‌దళ్ నాయకులు ప్రతాప్‌రెడ్డి, భక్తులు హనుమంతరెడ్డి, నాగేశ్వర్‌రావు,శ్రీరాములు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆటల పోటీలు

కర్నూలు (న్యూటౌన్): కల్లూరు మండలం బస్తిపాడు చర్చి సంఘం సభ్యులు క్రిస్మస్ పండుగ సందర్భంగా మహిళలు, చిన్నపిల్లలకు కబడ్డీ, స్కిప్పింగ్ పోటీలు నిర్వహించారు. అదేవిధంగా చిన్నారులకు డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. కబడ్డీ, స్కిప్పింగ్, డ్యాన్స్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.